క్లుప్తంగా

'కంటి వెలుగు' శిబిరానికి స్పందన



అవ్వకు కళ్లద్దాలు అందిస్తున్న బొడ్డేటి ప్రసాద్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వర మెట్టపై వెంకట గౌరీశంకర గ్రంథాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాల డాక్టర్ అరుణ 39 మంది వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా కళ్లద్దాలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వ నేత్ర వైద్యశాలలో చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు బి.లీలావతి, పి.పార్వతి, డి.నాగజ్యోతి, ఎం.అనురాధ పాల్గొన్నారు.

పాత చలానాలు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు

సీతమ్మధార: ఆటో డ్రైవర్లపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దొండపర్తి సమీపంలోని శ్రీకన్య థియేటర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ఆటో డ్రైవర్లపై ఉన్న ఈ చలానాలు రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించి జీవనోపాధి కల్పించాలని కోరారు. జీవో నంబర్లు 21, 31లను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, బి.రామారావు, శ్రీను, రమణ, రాజా, వాసు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గంగా పుష్కరాలు, కాశీ పుణ్యక్షేత్ర ప్రసాదాలను సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ, రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ ఆహ్మద్ పంపిణీ చేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు దూడరాజు మృతి చెందడంతో కాశీలో పిండ ప్రదానం చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

తహసీల్దార్ కార్యాలయంలో నేడు ప్రత్యేక స్పందన

మహారాణిపేట: టర్నర్ సత్రం ఆవరణలోని మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తహసీల్దార్ పి.ఆనందకుమార్ తెలిపారు. ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

16 నుంచి యోగా సదస్సు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఏయూ యోగా కేంద్రం ఈ నెల 16, 17వ తేదీల్లో సదస్సు నిర్వహిస్తోంది. బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ యోగిక్ సైన్సెస్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ

- కాలుష్యరహిత విశాఖకు సమష్టి కృషి
- మేయర్ హరివెంకట కుమారి



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడం అందరి బాధ్యత అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు జీవీఎంసీతో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు కలిసి రావాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగ నిషేధించాలన్నారు. మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షించాలని కోరారు. కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇంధన వాహనాలను కాకుండా విద్యుత్తుతో నడిచే వాహనాలను వినియోగించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమైన సంస్థల ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సాధిక్, అధికారులు ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీపీఏ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే

35వ వార్డులో..

జగదాంబ: మొక్కలు నాటుదాం..ఆహ్లాదకర వాతావరణం సృష్టిద్దామని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా వార్డులోని కార్యకర్తలతో కలసి వెలంపేట వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో ..

సాక్షి, విశాఖపట్నం : నగరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ నుంచి ప్లాస్టిక్ కాలుష్యంతో పాటు గాలి, నీరు, ధూళి కాలుష్యం లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వీపీఏ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే వెల్లడించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని విశాఖపట్నం పోర్టులో ఘనంగా నిర్వహించారు. పోర్టు పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దూబే మాట్లాడుతూ 'బీట్ ద ప్లాస్టిక్ – సొల్యూషన్ టు ది ప్లాస్టిక్ పొల్యూషన్' అనే థీమ్‌తో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నం పోర్టు అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇదే విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, పర్యావరణ కమిటీ మెంబర్ బీఎల్ శాస్త్రి, చీఫ్ ఇంజినీర్ వేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోర్టు పరిపాలనా భవనంలో అధికారులు మొక్కలను నాటారు.



పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న ఇస్కఫ్ ప్రతినిధులు



మొక్కలు నాటుతున్న విల్లూరి

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

సీతమ్మధార: ప్రపంచంలో మానవాళి మనుగడ కొనసాగలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ బాల మోహన్‌దాస్ అన్నారు. ఇస్కఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని ఎంత తగ్గిస్తే పర్యావరణాన్ని అంత పరిరక్షించుకున్నవాళ్లం అవుతామన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. నిర్వాహకులు ఇస్కఫ్ అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, సన్ మూర్తి, రాంప్రభు, హరి వెంకట్, ఎస్వీ ప్రసాద్, ఎం .నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థుల ర్యాలీ

అల్లిపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖ మహిళా కళాశాల విద్యార్థినులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాబా గార్డెన్స్, గొల్లలపాలెం ప్రాంతాల్లో ర్యాలీ సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, గ్రీన్ క్లబ్ కన్వీనర్ పుష్పలత, బోటనీ లెక్చరర్ జె.లావణ్య, ఎన్ఎస్ఎస్ పీవోడబ్ల్యూ వి.పద్మకుమారి, ఎస్.అనురాధ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వారు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

మత్స్య పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో..

మహారాణిపేట: భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ (ఎఫ్ఎస్ఐ) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్.కె.బీచ్‌లో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం తదితర అంశాలపై ప్లకార్డులతో ప్రచారం చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది, మత్స్యదర్శిని సిబ్బంది పాల్గొన్నారు.



ఏవీఎన్ కళాశాలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు



మహిళా కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

ఏవీఎన్ కళాశాలలో..

అల్లిపురం: పర్యావరణ దినోత్సవం సందర్భంగా మిసెస్ ఏవీఎన్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏవీఎన్ కళాశాల ఆవరణలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీజే శ్రీనివాస్, డాక్టర్ జేఎస్వీ శ్రీనివాస్, డాక్టర్ ఎం.కల్యాణి, డాక్టర్ డి.ఎర్రయ్య, డాక్టర్ డీకే ప్రవేతికారాణి, డాక్టర్ సి.చైతన్య, డాక్టర్ ఎం.సుదీప్ చంద్ర, డాక్టర్ సి.నాగకిరణ్ తదితరులు పాల్గొని వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

రైలు ప్రమాద మృతులకు చిన్నారుల నివాళి

డాబాగార్డెన్స్: ఒడిశా బాలాసోర్ రైలు ప్రమాదంలో మృతి చెందిన వారిని స్మరించుకుంటూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం చిన్నారులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు మాట్లాడుతూ రైలు ప్రమాదంలో ఎంతో మంది మృత్యువాత పడ్డారని, మరికొందరు క్షతగాత్రులయ్యారని పిల్లలకు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిన్నారులతో ఉపాధ్యాయుడు డి.సంజీవకుమార్ పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాజేంద్రవర్మ, అనురాధ, అరుణ, గిరి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న చిన్నారులు

ముగిసిన విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

డాబాగార్డెన్స్: సూర్యాబాగ్ మెయిన్ రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో గత నెల 31 నుంచి నిర్వహించిన వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజున పూర్ణాహుతి చేసి శివుని కల్యాణం వేడుకగా నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టారు. ఆలయ మేనేజర్ అడపా దేముళ్లు, వంశపారంపర్య ధర్మకర్త బాదంపూడి సూర్యకాంతం, ప్రధాన అర్చకుడు రమేష్ అప్పాజీ పర్యవేక్షణలో ఆలయ వార్షికోత్సవాలు జరిగాయి.

పోర్టులో షరతుల్లేని వేతన ఒప్పందం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఎటువంటి షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని కోరుతూ ఈ నెల 7న పోర్టు మెయిన్ గేట్ వద్ద యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, డాక్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు యునైటెడ్ పోర్టు డాక్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బి.జగన్ తెలిపారు. ఈ మేరకు సిటూ కార్యాలయంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేతన సంప్రదింపుల కమిటీలో ఐపీఏ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేయడాన్ని తప్పుపట్టారు. ఈ కమిటీలో కార్మికుల పక్షాన ప్రతినిధులు లేకుండా యజమానులతో సబ్‌కమిటీ వేయడం చట్ట వ్యతిరేకమన్నారు. షరతులు లేని వేతన ఒప్పందం సత్వరం చేయాలని, 2022 జనవరి ఒకటి నుంచి అమలయ్యే కొత్త వేతన ఒప్పందంపై మేజర్ పోర్టుల్లో ఉన్న ఫెడరేషన్లన్నీ చార్టర్ ఆఫ్ డిమాండ్స్ ఐపీఏకి సమర్పించడం జరిగిందన్నారు. సమావేశంలో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వీడీఎల్‌బీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శులు లక్ష్మణరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రికి లక్ష్య నేషనల్ సర్టిఫికెట్

- లేబర్ రూమ్ నాణ్యత ఆధారంగా ఎంపిక

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ విక్టోరియా(ఘోష) ఆస్పత్రి లేబర్ రూమ్ నాణ్యత అంశంలో లక్ష్య నేషనల్ సర్టిఫికెట్ పొందింది. 2017 డిసెంబర్‌లో లక్ష్య ప్రోగ్రామ్ ప్రారంభించింది. లేబర్ రూమ్‌లో మెరుగైన సంరక్షణతో పాటు నవజాత శిశువుల మరణాలను తగ్గించడం లక్ష్యంగా అమలు చేసిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి 70శాతం మేర లక్ష్యాన్ని సాధించి, సర్టిఫికెట్ పొందేందుకు అర్హత సాధించిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అందించిన సహకారం వల్ల ఈ లక్ష్యాలు సాధించగలిగామన్నారు. దీని వల్ల మెడికల్ కాలేజీ, డిస్ట్రిక్ట్ ఆస్పత్రి నుంచి ప్రోత్సాహకాలు వస్తాయన్నారు. ఐఎన్ఆర్ నుంచి వరసగా 12 లక్షల రూపాయలు మంజూరు చేస్తారని తెలియజేశారు.

ఆటోలో మేయర్, సైకిల్‌పై కమిషనర్..





సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాటిస్తున్న చర్యలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో, కమిషనర్ తన క్యాంపు కార్యాలయం నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

జోన్-5 ఏఎంహెచ్‌వోగా సునీల్‌కుమార్



జెడ్సీ కృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వోగా డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ జోన్-3కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జోన్ పరిధిలో మెరుగైన పారిశుధ్యానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు సహకరించాలని ఆయన కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జోన్-5ను మొదటి స్థానంలో ఉంచేలా కృషి చేస్తానన్నారున.

ఎమ్మెల్యే వాసుపల్లి ఉదారత

జగదాంబ: కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు. 35వ వార్డు కల్లుపాకలు, గాజుల వీధిలో నివసిస్తున్న పార్టీ కార్యకర్తలు మృతి చెందడంతో సోమవారం ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున వాసుపల్లి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా ఉండేందుకు ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. నియోజకవర్గంలోఎవరికి ఏ సమస్య వచ్చినా.. ప్రజాదర్బార్ గానీ స్వయంగా పార్టీ కార్యాలయానికి వచ్చి తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. పలువురు వార్డు నాయకులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

భర్త చెంతకు బిహార్ మహిళ

అల్లిపురం: బిహార్‌కు చెందిన పూజ అనే వివాహిత తన భర్తతో గొడవ పడి మరిదితో కలిసి రైలులో విశాఖపట్నం చేరుకుంది. రైల్వే ప్లాట్‌ఫారంపై ఉన్న ఆమెను ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి జీవీఎంసీ ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయికి సమాచారం తెలియజేశారు. పోలీసులు పూజను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మహిళల సంరక్షణా కేంద్రానికి, ఆమె మరిదిని చైల్డ్ హోంకు తరలించారు. పూజ నుంచి వివరాలు తెలుసుకున్న సిబ్బంది ఆమె భర్తకు తెలియజేయటంతో సోమవారం అతడు నగరానికి రావడంతో వారిద్దరిని ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి, కార్యదర్శి పి.వాసు అప్పగించారు.



పూజను భర్తకు అప్పగిస్తున్న జ్యోతిర్మయి

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు జాన్‌వెస్లీ అభినందన

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.శివానంద్‌ను రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ అభినందించారు. సోమవారం సాయంత్రం ఆయనను జాన్ వెస్లీ, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు, కార్పొరేటర్ ఎం.డి.షరీఫ్, బీసీ విభాగం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాసరావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ డాక్టర్ శివానంద్ వైద్య వృత్తి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆస్పత్రిలో పేద రోగులకు వైద్య సేవలు అందించడంలో చొరవ చూపాలన్నారు.



డాక్టర్ శివానంద్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న జాన్‌వెస్లీ

నోటీసులివ్వకుండా సర్వే తగదు

- '1450' భూముల విషయంలో వెంకటేశ్వరమెట్ట వాసుల అభ్యంతరం



వెంకటేశ్వరమెట్టపై ఓ ఇంటి గోడ మీద టౌన్ ప్లానింగ్ సర్వేయర్లు వేసిన మార్క్

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వివాదాస్పదంగా మారిన సర్వే నంబర్ 1450లోని భూముల విషయమై రెండు రోజులుగా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది డ్రోన్ సర్వేతోపాటు సాధారణ సర్వే చేపడుతున్నారు. దీనిపై వెంకటేశ్వరమెట్ట వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు ఎటువంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం తగదని అభిప్రాయం తెలియజేస్తున్నారు. తక్షణమే ఈ సర్వేపై తమకు సమాచారం అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు



సర్వే చేస్తున్నట్లు మాకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సర్వే విభాగం వారు గాని, దేవదాయ శాఖ వారు గాని ఎటువంటి సమాచారం అందజేయలేదు. దీనిపై ముందస్తు సమగ్ర సమాచారం అందజేసిన తరువాత సర్వే చేపట్టాలి.

– శరగడం కన్నారావు, వెంకటేశ్వరమెట్ట

పైఅధికారుల ఆదేశాలతో..

వెంకటేశ్వరమెట్ట 1450 సర్వే నంబర్‌పై రెండు రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. పైఅధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది సాధారణ సర్వేతోపాటు గృహస్తులకు ఇబ్బంది లేకుండా డ్రోన్ సర్వే కూడా నిర్వహిస్తున్నారు. ఇంకా మాకు ఆ సర్వే రిపోర్టు అందలేదు.

– జీవీ రమాబాయి, ఈవో, వెంకటేశ్వరమెట్ట దేవస్థానం

శానిటేషన్ సెక్రటరీల నిరసన

మహారాణిపేట: రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం శానిటేషన్ సెక్రటరీలు ఆందోళన చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు స్పందనలో అందజేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం వార్డు సచివాలయ ఎన్విరాన్మెంట్ శానిటేషన్ సెక్రటరీ అసోసియేషన్ నాయకులు కె.పీటర్, ఎస్.పార్థసారథి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా వార్డు సచివాలయంలో పని చేస్తున్న శానిటేషన్–ఎన్విరాన్మెంట్ సెక్రటరీలుగా పని చేస్తున్న మహిళలను కూడా తెల్లవారుజామున 4.30 గంటలకు రావాలని ఆదేశాలు జారీ చేస్తుండడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థ స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తూ, ప్రతి చిన్న కారణానికి మెమోలు, షోకాజ్‌లు, సస్పెన్షన్‌లు చేస్తూ ఉద్యోగుల్లో అభద్రత భావం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎస్.ప్రసన్న, ఝాన్సీరాణి, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, ఆదారి శివ, మంగరాజు, శివశంకర్, రమేష్ రాము, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 03 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్ రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి పాల్గొన్నారు.